# ఆలయ శిఖరం

**-ఎ.అంజలి**



సెప్టెంబర్ ఐదు. ఉపాధ్యాయ దినోత్సవం.

ఒక స్వచ్ఛందసంస్థ నగరంలోని పదిమంది సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయుల్ని ఎన్నికచేసి ఘనంగా సన్మానిస్తోంది. అందులో కోదండపాణి ఒకరు. సాయంత్రం ఆరుగంటలకి కార్యక్రమం. సభాస్థలి ఇంటికి దగ్గర్లోనే. కాలినడకన బయల్దేరా డాయన. డెబ్భై ఏళ్లుంటాయి. నిర్మలమయిన మనసు. సేవాభావం. నిస్వార్థమైన జీవనం, తన పనులు తానే చేసుకోవడం వల్ల కలిగే వ్యాయామం. అందుకే దృఢంగా ఉన్నారాయన.

"ముప్ఫయి ఏళ్ళు ఉద్యోగం వెలగబెట్టారు. ఏం సంపాదించారు? ఇప్పటికీ అద్దె ఇల్లే. మహా అయితే అమ్మాయికి, ఇద్దరబ్బాయిలకీ పెళ్ళిళ్ళు చేసుంటారు. వాళ్ల ఉద్యోగాలేవో వాళ్ళు చేసుకుంటున్నారు. నా ఒంటిమీద నగ లేదు. మీ చేతిలో బండీ లేదు. ఆ పెన్షనేదో వస్తోంది కాబట్టి కొడుకుల ముందు చేతులు చాపే ఖర్మ పట్టలేదు. కడుపునిం పని సన్మానాలకేం కొదువలేదు" భార్య మాటలు చెవుల్లో గింగురుమంటుంటే ఆమె మనస్తత్వం తెలిసిన కోదండపాణి చిరుమందహాసం చేశాడు.

ఆమె మూతివిరుపులకి తప్పు పట్టాల్సిందేం లేదు. వీధిలో ఉండే చంద్రశేఖర్ అనే కుర్రటీచర్‌కి రాష్ట్ర అవార్డ్ వచ్చిందని తెలిసి తనే విస్తుపోయాడు. ఆ టీచర్ రెగ్యులర్‌గా స్కూల్‌కి పోయిందేం లేదు. అతనో ప్రైవేట్ స్కూల్ రన్ చేస్తున్నాడు. ఇంకా వేరే బిజినెస్‌లు ఉన్నాయి. అలాంటివాడు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అంటే డబ్బు ఎంత బాగా పనిచేస్తోందో, ప్రభుత్వ పనితీరు ఎలా ఉందో అర్థం అవుతోంది.

ఆయన ఆలోచనల్లో ఆయన ఉంటే "ఏయ్! చూస్తూ నడువ్!" అనే కేకతో పాటూ కారు సడెన్ బ్రేక్‌తో ఆగిన చప్పుడైంది.

కోదండపాణి పరధ్యానం, ఆయన మాట వినేసరికి మళ్ళీ ఏదో అనబోతున్న డ్రైవర్‌ని వారిస్తూ వెనకసీట్లో కూర్చున్న వ్యక్తి కారు దిగాడు.

"నమస్కారం మాష్టారూ!" రెండుచేతులూ జోడించి ఆప్యాయతతో దగ్గరకు వచ్చాడు. కళ్లద్దాల్ని సవరించుకున్నారు మాష్టారు.

"నేనండీ...కుమార్‌ని" నవ్వుతూ పలికాడు.

"అస్తమానం అబద్ధం ఆడడమే నీ పనట్రా. వెధవా! అంటూ చెవి మెలిపెట్టేవారు చూడండీ. ఆ వెధవని" అన్నాడతను మళ్లీ నవ్వేస్తూ.

గుర్తుపట్టి "ఏన్నేళ్లయ్యిందయ్యా నిన్ను చూసి. ఏం చేస్తున్నావిప్పుడు?" ప్రేమగా అడిగాడాయన.

"అప్పుడబద్ధాలాడేవాడ్నని చీవాట్లేశారు కదండీ. లాయర్‌నయ్యాను. మీ ఆశీర్వాదంతో ఇప్పుడేమో హైకోర్ట్‌లో డిఫెన్స్ లాయర్‌ని" నిగర్వంగా అన్నాడు.

"కార్లో వెళదాం రండి మాష్టారూ" ఆహ్వానించాడు కుమార్ అభిమానంగా.

కోదండపాణి సంశయిస్తుంటే "మీరు వెళ్ళే చోటికే నాకూ ఆహ్వానం ఉంది. మీ ఇంటికొచ్చి మిమ్మల్ని తీసుకువద్దామనుకుంటే కారు ట్రబుల్‌తో ఆలస్యం అయింది. అనుకోకుండా మీ దర్శనం అయింది" ప్రతి పదంలో వినయం తొణికిసలాడింది మాష్టారి పట్ల. కోదండపాణి కూర్చున్నాక కారు స్టార్ట్ అయ్యింది.

* * *

సరైన టైంకే సభ ప్రారంభమయింది.

సన్మాన కార్యక్రమం మొదలయ్యింది.

ఒక్కో ప్రముఖవ్యక్తి ఒక ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్నారు. చివరగా కుమార్ వంతు వచ్చింది. అతను సౌమ్యంగా మైకు ముందుకు వచ్చి "ఈరోజు ఉపాధ్యాయుల దినోత్సవమే కాదు. విద్యార్థుల ఆనందోత్సవం. గురువు లేనిదే చదువులేదు. చదువు లేనిదే మనిషి పరిమళించలేదు. పరిమళం లేని మనిషికి సమాజంలో రాణింపులేదు. అలాంటి గురువుని స్వయానా చిన్నప్పటి నా గురువుగారిని నేను సన్మానించడం సబబో కాదో తెలియదు. కానీ దేవుడిని భక్తుడు పూజించడం రివాజు. నాకీయన గురువే కాదు. నన్ను సన్మార్గంలో నడిపించి నాయీ ఉన్నతికి కారకుడైన దైవం. ఆ దైవాన్ని భక్తితో పూజించే అవకాశం దొరకడం నా అదృష్టం. అందుకే హైదరాబాద్ నుంచి ఇంతదూరం ఈ మారుమూల పట్టణానికి వచ్చింది! కోదండపాణి మాష్టారు లేకపోతే ఈ లాయర్ కుమార్ లేడు" ఉద్వేగభరితమైన ప్రసంగానంతరం కుమార్ మాష్టారికి పూలదండ వేసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి సంస్థ వాళ్లిచ్చిన మెమెంటో ప్రదానం చేశాడు.

ఎవరూ ఊహించని రీతిలో సవినయంగా ఆ మాష్టారి పాదాలకి సాష్టాంగపడి నమస్కారం చేశాడు. కుమార్ అభిమానానికి ఆ మాష్టారి ఎద పులకించింది. శిష్యుడి చర్యకి విచలుడై ప్రేమగా ఆశీర్వదించి వాత్సల్యంతో లేవనెత్తాడు. సభాస్థలి ఒక్కసారిగా నివ్వెరపోయింది. హఠాత్తుగా అక్కడి వాళ్ల గుండె కొండల నడుమ ఎవరెస్టాయ్యారా మాష్టారు. ఆనందాతిశయంతో ఆయన చెక్కిళ్లకి తడి చేరుతూంటే "బాబూ.. చాలిక ఈ జన్మకీ పురస్కారం" అనుకున్నాడు.

* * *

మాష్టార్ని ఇంట్లో దింపి కుమార్ వీడ్కోలు తీసుకున్నాడు.

కోదండపాణి సభా విశేషాలు భార్యకి తెలిపి-

"ఉపాధ్యాయవృత్తి పవిత్రమైంది. డబ్బు సంచులు మూటకట్టుకోకపోయినా మంచి మనసుల గుండెల్లో నిండిపోతాం. మనం ఏ ధనరాశితో ఇక్కడకు రాలేదు. ఏదీ మన వెంట రాదు. మంచితనం, మానవత్వం, ఉన్నత సంస్కారం ఇవే ఉత్తమ ఉపాధ్యాయుడి లక్షణాలు. ఈ లక్షణాలున్న ఏ మనిషైనా సమాజంలో ఆలయశిఖరమై దర్శనమిస్తాడు. శాశ్వతంగా మనుషుల మధ్య మహోజ్వలంగా వెలిగిపోతాడు" అంటూ నవ్వాడాయన శ్రీమతి వంక చూస్తూ.

బయట భర్తకున్న విలువ తెలుసుకున్న ఆమె సాలోచనగా తలపంకించింది.

★